**పత్రికాప్రకటన** **కాకినాడ, జూలై 26, 2019.**

రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, వచ్చిన ప్రతీ ఫిర్యాదులను, సమస్యలను ఎంపిడిఓలు, జిల్లా అధికారులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి ఆదేశించారు.

శుక్రవారంనాడు జిల్లా ప్రజాపరిషత్ సమావేశపు హాలులో ఎంపిడిఓలతో సంబంధిత శాఖల పని తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ స్పందనలో పింఛన్లు, రేషన్ కార్డులు, హౌసింగ్, ఇళ్ళ పట్టాలకు సంబంధించి కలక్టరేట్ కు రానవసరం లేదని, మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అర్జీలు, ఫిర్యాదులు ఎక్కడ ఇచ్చినప్పటికీ రశీదు ఇచ్చి నిర్ణీత సమయంలో పరిష్కరించడం జరుగుతుందని, ఇందుకు ఎంపిడిఓలు ప్రజలకు భరోసా ఇచ్చేలా పనులు చేయాలన్నారు . అక్టోబర్ 2 తేదీ నుండి గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయనున్నందున గ్రామ వాలంటీర్లకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని, వారి నియామకాలు పూర్తయిన తర్వాత శిక్షణ ఇవ్వాలని ఎంపిడిఓలకు సూచించారు. ముఖ్యమంత్రి ప్రతీ మంగళవారం జిల్లా కలక్టర్లు, ఎస్.పీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి, స్పందనలో వచ్చిన పిటీషన్లు పరిష్కరించి, ప్రజలకు ఇబ్బందులు తీర్చాలని ఆదేశాలు ఇచ్చియున్నారన్నారు. వచ్చిన పిటీషన్లు పరిష్కరించడం, తిరస్కరించడం జరుగుతుందని, తిరస్కరించడానికి సరైన కారణం ఉంటేనే తిరస్కరించాలని కలక్టర్ తెలిపారు. అసెంబ్లీ అయిన తరువాత సి.యం. జిల్లాల్లో పర్యటిస్తారని, ఫిర్యాదుల పరిష్కారం నాణ్యమైనదిగా వుండాలని, పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు దృష్టి పెట్టాలన్నారు. పిటీషనర్స్ వచ్చినప్పుడు జిల్లా అధికారులు, ఎంపిడిఓలు నవ్వుతూ పలుకరించి సమస్యలు అడిగి తెల్సుకుని పరిష్కారం చేయాలని, అధికారులంటే పని చేస్తారనే మంచి అభిప్రాయం ప్రజల్లోకి వెళ్ళాలన్నారు. అధికారులు అవినీతి రహితంగా పని చేయాలని, నీతి నిజాయతికీ అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలకు వెళ్ళాలని, ముఖ్యంగా సంక్షేమ పథకాలకు సంబంధించి సక్రమంగా పనులు జరుగుతున్న వివరాలను పరిశీలించాలన్నారు. పథకాల అమలు, రుణాల మంజూరులో మధ్యవర్తుల ప్రమేయం ఉండకూడదని, లబ్దిదారులే నేరుగా అధికారులను కలిస్తే అవినీతికి తావుండదన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు పని ముట్లు అందుతున్న వివరాలు తెల్సుకోవాలని, అప్పుడే నాణ్యతాపరంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా పారిశుధ్యం, పరిసరాల శుభ్రత కార్యక్రమాలు జరుగుతున్నాయని వచ్చే అక్టోబరు 2 మహాత్మాగాంధీ జయంతి నాటికి గ్రామాల్లో పారిశుధ్యం తప్పనిసరిగా మెరుగుపడాలని, పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి నిర్వహించాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామాలలో పారిశుధ్యం అమలును పర్యవేక్షించాలని ఛీఫ్ సెక్రటరీ గారు ఆదేశాలు ఇచ్చారని, సోలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ యూనిట్లు తిరిగి నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలక్టర్ -2 జి.రాజకుమారి, జడ్.పి. సిఇఓ యం.జ్యోతి, డ్వామా పిడి యం.శ్యామల, హౌసింగ్ పిడి వీరేశ్వర ప్రసాద్, డి.పి.ఓ. ఎస్.వి.నాగేశ్వర నాయక్, బిసి కార్పొరేషన్ ఇడి ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, ఆర్.డబ్లూ.ఎస్. ఎస్.ఇ. గాయత్రి దేవీ తదితరులు పాల్గొన్నారు.

( సమాచార శాఖ చే జారీ )